క్లుప్తంగా

మండల మీట్ రేపు

కల్లూరు(పులిచెర్ల): పులిచెర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28 సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ సి.నాథమునిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, మండల స్థాయి అధికారులు, హాజరు కావాలని కోరారు.

29న రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఈనెల 29న మంగళవారం రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ ప్రకటనలో కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న కాంతమ్మ

బైరెడ్డిపల్లె: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ అన్నారు. మండలంలోని కొత్తయిండ్లు ప్రాథమిక పాఠశాలతో పాటు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యసిబ్బంది దివ్యశ్రీ, నాగేశ్వరి, హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, తిప్పక్క పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గంగవరం: ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలో గంగ్రాజుపల్లికి సమీపంలోని ఫాంగేట్ మిల్క్ డెయిరీ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని పత్తికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డెయిరీలో పనిచేసే సిబ్బంది, కూలీలు 74మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, ఏఎన్‌ఎంలు,ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- వైఎస్సార్‌సీపీ నేతకు తీవ్రగాయాలు



గాయపడిన కుమార్

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో శనివారం వైఎస్సార్‌సీపీ నేత కుమార్ (36) వెళుతున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ఈప్రమాదంలో కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు.

గో స్లో స్లోగన్‌లు ఏర్పాటు చేయాలి

పలమనేరు: మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు సేలం–తిప్పూరు ఘాట్‌లో ఏర్పాటు చేసినట్టు సోలార్‌తో పనిచేసే గో స్లో స్లోగన్‌లు చెప్పే హారన్‌లను ఏర్పాటు చేయాలని పలమనేరు పబ్లిక్ ఇష్యూస్ గ్రూపు నిర్వాహకులు సుధీర్‌కుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని తిప్పూర్ ఘాట్‌లో ఇలాంటివి పెట్టడంతో ప్రమాదాలు తగ్గాయన్నారు. కాగా శనివారం సైతం మొగిలి ఘాట్‌లో ముందు వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో వెనుక బైక్‌పై వెళుతున్న వ్యక్తి లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: మండల పరిధిలోని అప్పినపల్లిలో శనివారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వే డీటీ రమేష్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేపై అభ్యంతరాలు తెలిపేవారు అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సాయిరాజ్, ఎంపీటీసీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణతో ముప్పు తప్పదు

పలమనేరు: ఎస్సీ వర్గీకరణ జరిగితే దళితులు వారి ఉపకులాలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బందులు తప్పవని స్థానిక దళిత సంఘాల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమేరకు సంఘ ప్రతినిధుల సమావేశం శనివారం పలమనేరులో జరిగింది. వారు మాట్లాడుతూ రాజకీయాల కోసం కొందరు వర్గీకరణ అంశాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల పలమనేరు నియోజకవర్గంలో దళితులపై దాడులు, భూముల దురాక్రమణలు ఎక్కువయ్యాయని తెలిపారు. వీరికి తమ సంఘాల జేఏసీ అండగా ఉంటూ న్యాయపోరాటాలు చేస్తామన్నారు. శ్రీనివాసులు, చంద్రకుమార్, మునిరత్నం, సుబ్రమణ్యం, కోటి, వెంకటేష్ పాల్గొన్నారు.

భలే మంచి ఇసుక బేరము!

- పెట్టుబడి లేకుండా పచ్చనేతలకు ఆదాయం
- డంప్‌ల వద్దకొచ్చి ఇసుకను కొంటున్న కర్ణాటక వ్యాపారులు
- టిప్పర్‌లో లోడు కాగానే నగదు
- టిప్పర్ ఇసుక తరలిస్తే రూ.13వేలు గిట్టుబాటు



ముదరంపల్లి వద్ద ఇసుక దంపులు



పలమనేరు: ఇసుక వ్యాపారాన్ని ఎలా చేస్తే సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చునో పచ్చపార్టీ వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో. కూటమి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఉచిత ఇసుక హామీతో ఇసుకాసురుల వ్యాపారం ఊపందుకుంది. ఇలాంటి తరుణం మళ్లీ రాదు ఆలోచించిన ఆశా భంగమన్నట్టు పోటీలు పడి మరీ పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్య నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. గత పదేళ్లలో కౌండిన్యలో జరిగిన ఇసుక అక్రమ రవాణా ఓ ఎత్తు అయితే ఈ నాలుగు నెలల్లో అంతకుమించి జరిగింది. ఇంకా ఇసుకాసురులు కోటీశ్వరుల య్యేదాకా జరుగుతూనే ఉంటుందేమో.

ఇదో తెలివైన వ్యాపారం...

గతంలో ఇక్కడి నుంచి ఇసుకను అక్రమంగా కర్ణాటకలోని హోస్‌కోట్‌కు తరలించేవారు. ఇప్పుడు కర్ణాటక నుంచే టిప్పర్లు దంపులవద్దకే వస్తున్నాయి. ఇక్కడి ఇసుకారులకు ట్రాన్స్‌పోర్ట్ బాధకూడా తప్పింది. ఓ ట్రాక్టర్ ఇసుకను చెప్పిన చోటుకు దింపితే రూ.2వేలుగా నిర్ణయించారు. దీంతో ట్రాక్టర్లున్నవాళ్లు నలుగురు కూలీలను పెట్టుకొని కౌండిన్యలో ఇసుకను తోడి డంపుల వద్ద దించుతున్నారు. ఓ టెన్ వీలర్ టిప్పర్‌కు 6 ట్రాక్టర్ లోడ్లు. టిప్పర్ లోడుకు సరిపోయే ఇసుకను మాత్రమే ఓ డంప్ వద్ద దించుకుంటున్నారు. ఆపై రాత్రుల్లో కర్ణాటక నుంచి టిప్పర్‌లు రాగానే జేసీబీతో ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడి వ్యాపారులు స్పాట్‌లోనే టిప్పర్‌కు రూ.26వేలు చెల్లిస్తున్నారు. ఆడబ్బులో ఆరు ట్రాక్టర్లకు రూ.2వేలు చొప్పున రూ.12వేలు చెల్లిస్తున్నారు. ఇక లోడింగ్ జేసీబీకి రూ.వెయ్యి. మొత్తం కలిపితే రూ.13వేలు. టిప్పర్‌కు వచ్చేది రూ.26వేలు. ఇందులో రూ.13వేలు పోతే ఇసుకాసురులకు మిగిలేది రూ.13 వేలు. వారి వారి స్తోమతను బట్టి రోజుకు ఓ టిప్పర్ పంపిస్తే రూ.13 వేలు, మూడు పంపిస్తే రూ.39వేలు మిగులుతోంది. ఇందుకు ఇసుకాసురులు ముందుగా పెట్టాల్సిన పెట్టిబడి ఏమీ లేదు.

ఎలాంటి ఇబ్బందులు లేకుండా...

నదిలో ఇసుకను తోడుతున్న వారిని అడిగితే ఇంటి నిర్మాణానికని చెబుతున్నారు. డంప్ వద్ద కేవలం టిప్పర్‌కు సరిపోయేంతే నిల్వ పెడుతన్నారు. దీంతో ఎవరైనా చూసినా పెద్దగా పట్టించుకోరు. కర్ణాటక నుంచి ఇక్కడికే టిప్పర్లు వచ్చి ఇసుకను తరలించుకెళుతున్నారు. దీంతో ఇక్కడి బోర్డర్‌లోగాని ఆపై కర్ణాటకలోగాని ఇక్కడి స్మగ్లర్లకు ఎలాంటి సంబంధం లేదు. కేవలం ఎక్కడో టౌన్‌లో ఉంటూ కేవలం ఫోన్‌ల ద్వారా ట్రాక్టర్లను పంపడం చెప్పినచోట ఇసుకను డంప్ చేయడం, ఆ లోకేషన్‌ను టిప్పర్ డ్రైవర్‌కు పెట్టడం, రాత్రిపూట లోడ్ కాగానే ఫోన్‌పేలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అవుతోంది. ఆపై ఇక్కడి స్మగ్లర్లు ట్రాక్టర్లు, జేసీబీ వాళ్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎలాంటి హాని లేకుండా కౌండిన్యలోని ఇసుకను చాలా తెలివిగా పక్క రాష్ట్రానికి పంపేస్తున్నారు.

పెద్దపంజాణిలోనే ఎక్కువ...

పెద్దపంజాణి మండలంలో కౌండిన్య నది ఏడు పంచాయతీల్లో ప్రవహిస్తోంది. దీని చుట్టూ 30 దాకా గ్రామాలున్నాయి. దీనికితోడు ఇక్కడ ఇసుక లభ్యత ఎక్కువగా ఉంది. దీంతో వీరి వ్యాపారం మూడు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. ముదరంపల్లి, మాడి దిగువ ప్రాంతం, అప్పినపల్లి, అమ్మరాజుపల్లి, బొమ్మరాజుపల్లి, శివాడి, చామనేరుల వద్ద పొలాల్లో ఎటుచూసినా ఇసుక డంపులు దర్శనమిస్తుంటాయి. మళ్లీ అవి రాత్రుల్లో మాయమై పొద్దున మళ్లీ కొత్త డంపులు పుడుతున్నాయి. ఈ అక్రమాలను అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. కౌండిన్య నదిలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను చూసి రైతులు కడుపుమండి ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



కిషన్

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్.కిషన్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నటరాజరెడ్డి తెలిపారు. వరుసగా మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూపడం ద్వారా కిషన్‌కు ఈ అవకాశం దక్కిందన్నారు. ఈనెల 28 నుంచి బాపట్లలో జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటాడని చెప్పారు. మండలంలోని సోగడబళ్లకు చెందిన సోమశేఖర్, హేమ దంపతుల కుమారుడైన కిషన్ చెస్‌లో చూపుతున్న ప్రతిభను ఎంఈఓ చంద్రశేఖర్ అభినందించారని తెలిపారు. అలాగే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బి.విశాల్, కె కుమారి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

రాజకీయంగా ఎదుగుతున్నందునే ఆరోపణలు

పలమనేరు: తాను రాజకీయంగా ఎదుగుతున్నందునే కొందరు తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని 17వార్డు కౌన్సిలర్ హైదర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల క్రితం తాను రియాజ్‌బాషాపై దాడి చేశానంటూ తప్పుడు మాటలను సోషల్ మీడియాలో చెప్పాడని తెలిపారు. ఇదంతా రాజకీయకక్షతో సాగుతున్న తతంగమేనని పేర్కొన్నారు.

పోలీస్ బందోబస్తుతో సమావేశం





మాట్లాడుతున్న ఎంపీపీ, మండల కార్యాలయం వద్ద పోలీసులు

- అజెండా ఆమోదం
- అధికారులు ఏకపక్షంగా వ్యవహరించరాదు
- ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని పోలీస్ బందోబస్తుతో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి నిర్వహించారు. శనివారం మండల సమావేశం నిర్వహిస్తామని సీఐ శ్రీనివాసులుకు ఎంపీపీ లేఖ రాశారు. ఈమేరకు సీఐలు శ్రీనివాసులు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశానికి మెంబర్లను అనుమతించారు. సమావేశాన్ని ఎంపీడీఓ లీలామాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అజెండాలోని అంశాలను ఆమోదించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని గుర్తించి పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశించారని ఆమేరకు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కొంత మంది అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, కోఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సేవలో రెడ్ క్రాస్ విద్యార్థులు

కల్లూరు(పులిచెర్ల): స్థానిక జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని ఆ విభాగం సమన్వయకర్త వనపర్తి సిద్దులు తెలిపారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ విద్యార్థులు రోగులకు పండ్లు పంచిపెట్టారు. డా.సుజిత, ఉపాధ్యాయులు రాజశేఖర్, వేణుగోపాల్, రాజేంద్ర, సరస్వతి, శారద పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యాసామగ్రిని చూపుతున్న విద్యార్థులు

గంగవరం: మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని శనివారం ఉచితంగా అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.300 విలువ చేసే విద్యాసామగ్రి కిట్‌ను దాతలు అందించారు. దాతలు అమృతభారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం దామోదర్, శతావధాని ఆముదాల మురళి, ఉపాధ్యాయులు తులసినాథంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: బాల కార్మికులకు పునరావాసం కల్పించాలని కార్మికశాఖ అధికారి ఆనందబాబు అన్నారు. అయన రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలలో బాల కార్మికుల కోసం తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నుంచి పిల్లలను విద్య వైపు పోత్సహించాలని అన్నారు. నిరాదరణకు గురైన పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వారికి మా సంస్థ నుంచి అన్ని రకాల వసతులను కల్పిస్తామని గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు జీ.వి.ఎస్.బాబు అన్నారు. ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీఆర్‌పీ అనసూయ పాల్గొన్నారు.

పూత దశ నుంచే జాగ్రత్తలు





సమావేశంలో సూచనలిస్తున్న డీహెచ్‌ఓ మధుసూదన్ రెడ్డి, హాజరైన ఉద్యోగులు

- జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

పలమనేరు: మామిడిలో పూత దశ నుంచే రైతులు తగిన జాగ్రత్తలను పాటిస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఆమేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని హార్టికల్చర్ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో మామిడి పూత, పిందెలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ విజయశంకర్‌రెడ్డి, ఏఓ పద్మజ, హెచ్‌ఓలు లక్ష్మీప్రసూన, వింధ్య పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలో నెలకొన్న ఆక్రమణలను, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ స్థానిక బాలికోన్నత పాఠశాల వద్ద మున్సిపల్ దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారు దారిలో సైతం వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారని తెలిపారు. గుడియాత్తం క్రాస్ వద్ద డ్రైన్ సమస్య, రంగబాబు సర్కిల్‌లో కోళ్ల దుకాణాల వ్యర్థాల కారణంగా దుర్వాసనగా ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలంటూ పోలీసులను సైతం కోరామని పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారుల నిరీక్షణ

- అనుమతుల కోసం అధికార పక్ష నేతల చుట్టూ ప్రదక్షిణలు



బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణాలు

కుప్పం: పట్టణంలో ప్రతి ఏడాది ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించే టపాకాయల దుకాణాల అనుమతుల కోసం వ్యాపారులు నిరీక్షిస్తున్నారు. ప్రతి ఏటా టపాసుల తయారీ కేంద్రం శివకాశి నుంచి కొనుగోలు చేసి కుప్పంలో విక్రయించేవారు. ఇందుకోసం అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖల నుంచి పది రోజులు ముందే అనుమతులు పొందేవారు. అనంతరం దీపావళి పండుగ సందర్భంగా పట్టణానికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించేవారు. ప్రస్తుతం ఈ ఏడాది అందుకు భిన్నంగా అనుమతుల కోసం అధికార పార్టీ నేతలు, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని బైపాస్‌రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేసుకుని అనుమతుల కోసం వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. అధికారులు అనుమతులు ఇవ్వకపోగా, అధికార పార్టీ నేతలపై నెపం వేయడంతో వ్యాపారులు విస్తుపోతున్నారు. ఎప్పుడూలేని విధంగా ఈసారి అనుమతుల కోసం నాయకులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారంటూ వ్యాపారులు వాపోతున్నారు. అనుమతులు సమయానికి ఇవ్వకుంటే కొనుగోలు చేసిన స్టాక్ అమ్మకాలు లేక నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కుప్పంరూరల్: నూతనంగా ఏర్పడిన పాలిటెక్నిక్ కళాశాలల బోధనా సిబ్బంది కమిటీ తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. శనివారం ఎమ్మెల్సీని పాలిటెక్నిక్ కళాశాలల బోధనా కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, ట్రెజరర్ మహేష్‌తో పాటు సభ్యులు కలసి ఉద్యోగులకు ఉన్నత చదువులకు అనుమతి ఇవ్వాలని, జీతాల్లో స్కేల్స్ పెంపునకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఉద్యోగులకు ఆయన హామీ ఇచ్చారు. కుప్పం పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు రమేష్, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి



పశు గణన సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: మండలంలో పశుగణన సర్వేను పాడి రైతులు విజయవంతం చేయాలని మండల పశువైద్యాధికారి శ్రీధర్ అన్నారు. ఆయన శనివారం పశుగణన సర్వేను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల సంఖ్యను నమోదు చేస్తామని తెలిపారు. సర్వే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉంటుందనిని పేర్కొన్నారు. సర్వే చేసిన వాటికి మాత్రమే పథకాలు వర్తిస్తాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు సర్వేకు సహకరించాలని కోరారు.

తెలుగుభాషా పరిరక్షణలో తులసి పుష్పాలు!

- తెలుగుభాష సేవలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి
- సొంత ఖర్చుతో కార్యక్రమాల నిర్వహణ
- నేడు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పుష్కరోత్సవం



కళా నిలయం, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి భవనం

పలమనేరు: సంవత్సరంలో వచ్చే అన్ని దినోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, వేసవిలో పిల్లలకు శిక్షణ, భాషా పోటీలు, ఉగాది సమ్మేళనాలు, తెలుగు, మాతృభాషా దినోత్సవాలు, ఉగాది పుష్కరాలు ఇలా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో తెలుగుభాషా పరిరక్షణకు దంపతులైన తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. వీరు స్థాపించిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నేడు పుష్కరోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో వారు చేస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

వారి జీతం, జీవితం తెలుగుభాషాభివృద్ధికి అంకితం..

తెలుగుభాష పరిరక్షణకు పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు తులసీనాథంనాయుడు, పుష్ప దంపతులు. వీరిద్దరు 26 ఏళ్ల నుంచి సంపాదించిన జీతాన్ని సైతం వెచ్చించి తన రూ.30 లక్షల విలువైన స్థలంలో భార్యాభర్తలు రూ.20లక్షలు వెచ్చించి కళామందిరమనే సాంస్కృతిక నిలయాన్ని నిర్మించారు. తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి పేరిట పలమనేరు కేంద్రంగా తెలుగుభాషాభివృద్ధికి కృషిచేస్తున్నారు. తెలుగుభాష కోసం కృషిచేస్తున్న కళాక్షేత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓ గుర్తింపును పొందింది.


తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఏర్పాటు...

తులసీనాథంనాయుడు దంపతులు గురువులుగా బడిలో పిల్లలకు బోధించడంలో మొదలైన తెలుగుపై అభిమానం వీరిని తెలుగుభాషా ఉన్నతికోసం కృషిచేసేలా చేసింది. దీంతో మరికొందరు ఉపాధ్యాయులు, సాహితీప్రియులతో కలసి పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని 2012లో స్థాపించారు. ఇందులో యాభైమంది దాకా సభ్యులున్నారు. వందలాది మంది కవులు, రచయితలు, భాషాభిమానులను సన్మానించి సత్కారాలు చేస్తూ ముందుకెళుతున్నారు.

విద్యార్థులకు లక్షన్నర నీతిపుస్తకాల పంపిణీ...

వీరి సొంత నిధులతో నీతిపద్యాల ప్రతులు లక్షన్నర కాపీలను ముద్రించి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. తెలుగుభాషపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి పెద్దబాలశిక్ష పుస్తకాలను, బాలభారతం, రామాయణ, భాగవతం వంటి గ్రంథాలను పిల్లలకు బహుమతులుగా అందజేశారు. వీరు తెలుగుభాషకు చేస్తున్న కృషికి రాష్ట్రంలోనే కాదు, జాతీయ స్థాయిలోనూ పలు సన్మానాలు, సత్కారాలు బిరుదులు దక్కాయి.


తెలుగుభాష, సంస్కృతిని కాపాడడమే లక్ష్యం...



తెలుగుభాషను కాపాడుకోవాలనే ఆలోచనతోనే కృషిచేస్తున్నాం. ముఖ్యంగా తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలకు అందివ్వాలన్నదే మా సంకల్పం. సెలవు దినాలు, రోజువారి ఖాళీ సమయాల్లో కార్యక్రమాలను చేస్తున్నాం. ఇందుకు సహకరించి చేదోడుగా నిలుస్తున్న తెలుగుభాషాభిమానులకు రుణపడి ఉంటాం.

–తులసీనాథం నాయుడు, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పలమనేరు

భర్తకు తోడుగా నిలిచా..



మాతృభాష అయిన తెలుగును మరువరాదు. తెలుగుభాషపై పట్టుంటే మిగిలిన భాషల్లోనూ రాణించవచ్చు. నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలపై నిర్లక్ష్యం చూపుతోంది. ప్రపంచ దేశాలు మన సంస్కృతిని పాటిస్తుంటే మనం పట్టించుకోవడం లేదు. భర్తకు అండగా తెలుగుభాషాభివృద్ధికోసం కృషిచేస్తున్నా.

–పుష్ప, సమితి కార్యదర్శి, పలమనేరు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శనివారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో జరిగిన ఈ పోటీల్లో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసులకు సవాళ్లు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పలువురు ఇందులో పాల్గొని ప్రతిభ చూపించారు.

ఎవరిమాట నెగ్గుతుందో?

- ఏఎంసీ చైర్మన్ పదవి కోసం ఎదురుచూపులు!
- చక్రం తిప్పుతున్న సీఎం సతీమణి
- బెడిసికొట్టిన ఆశావహుల ప్రయత్నాలు
- ఆశలు వదులుకున్న కూటమి నేతలు
- ఇప్పటికే ఓ నాయకునికి పక్కా అయినట్టు సమాచారం



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను చైర్మన్ కుర్చీపై పడింది. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపిన విషయం విదితమే. దీంతో త్వరలో ఏఎంసీ చైర్మన్‌ను నియమించడం ఖాయమైంది. ఇలాఉండగా గత మూడు నాలుగు నెలల నుంచి పలువురు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ద్వారా, కొందరు నేరుగా సీఎంను కలసి వారి వారి ప్రయత్నాలు చేశారు. అయితే ఆశావహుల ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. ఫలితంగా ఈ పదవిని ఆశించిన కొందరు నేతలు మద్యం షాపుల సిండికేట్‌లోకి దిగేశారు. మరికొందరు కాంట్రాక్టు పనులపై ఆశలు పెట్టుకున్నారు. ఫలితంగా అధిష్టానం ఎవరికైనా ఇచ్చుకోనీలే అనే మాట ఇప్పుడు కూటమి నేతల్లో వినిపిస్తోంది. ఇలా ఉండగా స్థానిక ఎమ్మెల్యే దీన్ని ఎవరికి కట్టబెట్టాలో ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు సమాచారం. మరోవైపు సీఎం చంద్రబాబు సతీమణి ద్వారా నియోజకవర్గానికి చెందిన మరో ముఖ్యనేత ఈ పోస్టును పొందడం ఖాయమనే మాట జోరుగా వినిపిస్తోంది. కానీ స్థానిక ఎమ్మెల్యే సిఫారసు చేసిన వారికే ఏఎంసీ దక్కుతుందా లేదా పైస్థాయిలో పలుకుబడి ఉండి దీనిపై కన్నేసిన నాయకుని మాట నెగ్గుతుందా వేచి చూడాల్సిందే.